# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1) రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ- ఆర్టీజీఎస్ కార్యకలాపాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**2. 2030 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని పేర్కొన్న మంత్రి వై.సత్యకుమార్ యాదవ్.**

**3. గడిచిన 2 ఏళ్లలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి పలు చర్యలు చేపట్టామని వెల్లడించిన మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి.**

**4. మాదక ద్రవ్యాల నియంత్రణకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపిన ఈగల్ సంస్థ ఐజీ ఆకే. రవికృష్ణ.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ- ఆర్టీజీఎస్ కార్యకలాపాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్నారు. ప్రజా సేవల పర్యవేక్షణ, సాంకేతికత వినియోగం వంటి అంశాలపై అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం మధ్యాహ్నం స్వర్ణాంధ్ర విజన్-10 సూత్రాల అమలుకు సంబంధించిన అవగాహన ఒప్పందం - ఎంఓయూ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

దేశం నుంచి 2030 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన “టీబీ ముక్త్ భారత్ అభియాన్” కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షయ బాధితులకు పోషకాహార కిట్లను అందజేశారు. అనంతరం సత్యకుమార్ మాట్లాడుతూ, క్షయవ్యాధి నిర్మూలనలో సమాజ భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంస్థలు, పారిశ్రామికవేత్తలు తమ వంతు బాధ్యతగా నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగస్వాములై క్షయవ్యాధి బాధితులను దత్తత తీసుకోవాలని కోరారు.

--------------------------

ప్రజల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ముఖ్యమంత్రి సహాయ నిధి – సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల కోసం 76 మంది లబ్ధిదారులకు 68 లక్షల 42 వేల రూపాయల చెక్కులను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, గత రెండేళ్ల కాలంలో పాలకొల్లు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 14 కోట్ల 22 లక్షల రూపాయలను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ –ఎస్.ఐ.ఆర్ విజయవంతంగా కొనసాగుతోందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో భాగంగా ఇప్పటివరకు 58.12 శాతం మంది ఓటర్లకు గణన పత్రాల పంపిణీ పూర్తయిందని ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 4 కోట్ల 16 లక్షల 27 వేల 694 మంది ఓటర్లలో 2 కోట్ల 41 లక్షల 93 వేల 304 మందికి పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. అలాగే, ప్రజల నుంచి వచ్చిన 8 లక్షల 45 వేల 108 పత్రాలను ఇప్పటికే డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. ఓటర్ల వివరాలను మరింత పారదర్శకంగా, కచ్చితంగా నమోదు చేయడం కోసం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ఎన్నికల యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహిస్తోందని వివేక్ యాదవ్ తెలిపారు.

---------------------------

ఎల్ నినో ప్రభావం దృష్ట్యా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ రోజు నుంచి 27వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయశాఖ సంచాలకులు మనజీర్ జిలాని సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో వాతావరణ మార్పుల ప్రభావం, ముఖ్యంగా ఎల్ నినో పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో ఏర్పడే సవాళ్లు, వాటిని ఎదుర్కొనేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నివారణ చర్యలపై నిపుణులు అవగాహన కల్పించనున్నామని చెప్పారు. అలాగే, పప్పు ధాన్యాల పంటల సాగు విధానాలు, మెరుగైన దిగుబడుల సాధనకు అవసరమైన సాంకేతిక సూచనలు, పంటల నిర్వహణ పద్ధతులు, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై రైతులకు వివరించనున్నట్లు తెలిపారు.

---------------------------

గడిచిన 2 ఏళ్లలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి పలు చర్యలు చేపట్టామని దేవాదాయ శాఖ మంత్రి అనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, ఆలయాల్లో ధూప దీప నైవేద్య పథకం అమలుతో పాటు దేవాలయల్లో నిర్మాణ, అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భజన మందిరాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్‌మెంట్- ఈగల్ ఎన్టీఆర్ జిల్లా విభాగం ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్" వారోత్సవాలలో భాగంగా విజయవాడలో నిర్వహించిన వాకథాన్ కార్యక్రమంలో ఈగల్ టీం ఐజీ ఆకే. రవికృష్ణ ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, సంబంధిత సమాచారం ఉంటే ప్రజలు 1972 నెంబర్‌కి ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. యువతను సరైన మార్గంలో నడిపించడమే లక్ష్యంగా "నషా విముక్త భారత్ అభియాన్" కార్యక్రమాన్ని చేపట్టామని పొగాకు రహిత విద్యాసంస్థల కార్యక్రమం, "డ్రగ్స్ వద్దు బ్రో" వంటి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు.

---------------------------

అనంతపురం జిల్లాలో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న " పోలియో చుక్కలు" కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో పల్స్ పోలియో-2026పై నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఒక వెయ్యి 289, పట్టణ ప్రాంతాల్లో 334 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఇందుకోసం 5 వేల 247 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

---------------------------

తిరుపతి జిల్లాలోని పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి సమీపంలో ఈ తెల్లవారుజామున జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా పలువురికి గాయాలైయ్యాయి. కడప-చెన్నై ప్రధాన రహదారిపై తిరుపతి నుంచి కడప వెళ్తున్న బస్సు, లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్సకోసం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి పునీత్ సాయి, విద్యార్థిని యశ్విత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

---------------------------

ప్రపంచ వర్షారణ్యాల సంరక్షణ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. వర్షారణ్యాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం, వాటి పరిరక్షణకు ప్రోత్సాహం కల్పించడం లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 22న జరుపుకుంటారు. తొలిసారిగా 2017 జూన్ 22న ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రపంచ వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు, జీవ వైవిధ్యానికి వర్షారణ్యాలు కీలకంగా నిలుస్తున్నాయి. వర్షాలు ఉష్ణోగ్రతలను నియంత్రించడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అటువంటి వర్షారణ్యాల పరిరక్షణ గురించి తెలియజేయడమే ఈ దినోత్సవ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. ఈగల్ ఆధ్వర్యంలో రూపొందించిన "1972 హెల్ప్‌లైన్" ప్రచార పత్రికలను ఆయన నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దుర్వినియోగాన్ని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

======================